స్కెచ్

# తేయాకు తోటల్లో—

మరువాడ నారాయణమూర్తి

కోహిమా రంగంలో యుద్ధం ప్రజ్వలించే సూచనలు ప్రబలంకావడంతో, అంతవరకూ గారిజన్ డ్యూటీలోనున్న మేము విశ్రాంతికోసం "లటకోజాన్" టీ ఎస్టేట్ సమీపంలో నివాసం యేర్పరచుకోవలసి వచ్చింది. ముప్పొద్దులా హాయిగా తిని, ప్లెటూనుకి రెండుపూటలా కవాతు యివ్వడంతప్ప యితరత్రా ఆట్టే పనియేమీ లేకపోయింది నాకు.

పదిహేను వరుసలు చిన్నచిన్న యిళ్లున్న కార్మికుల కాలనీ, మేనేజరు బంగళా, ఫాక్టరీ, చిన్న పోస్టాఫీసూ, హాస్పిటల్, పెద్దదీకాని చిన్నదీకాని ఓ దుకాణం- లటకోజాన్ ఒక చిన్న ఆదర్శగ్రామంలా కాన్పించింది.

అక్కడికెళ్ళిన కొద్దిరోజులకే ఫాక్టరీ ఇంజనీర్ మహేంద్రనాథ్, పోస్టుమాస్టర్ బెనర్జీ, డాక్టర్ రాయ్, షాహుకార్ పన్నాలాల్ వీరందరి పరిచయ భాగ్యం లభించింది.

చిరపుంజీ యిక్కడికి చాలా దగ్గిరే. అందుకని వర్షంకురియని రోజు, రోజేమిటి నిముషం కూడా వుండదు. ఈ వర్షం ప్రాణాన్ని విసిగెత్తించేస్తుంది. గతసారి వైట్‌ఫోర్టులో వుండగా యెండలు భరించలేక చిరపుంజీ పోతే బాగుండుననిపించి, కానుపించని, యెదురుగా లేని దేవుడికెన్ని మ్రొక్కులుమ్రొక్కాను! మరి యిప్పుడు యీ యెడతెగని, యెడతెరపిలేని కుంభవృష్టికి తట్టుకోలేక మళ్ళీ వైట్‌ఫోర్టుకి పోతే బాగుండుననిపించింది. మనః ప్రకృతి చాలా విచిత్రమైనది. శరీరప్రాణులు "అతి" దేనినీ సహించలేవు. సంతోషమూ, దుఃఖమూ, కష్టమూ, సుఖమూ, దేనినీకూడా యెక్కువ భరించలేకపోవడమూ, ఏది యెక్కువైనా తట్టుకోలేక పోవడమూ! కొన్నికొన్ని సమయాల్లో యీ "అతి" ఆత్మహత్యలకో, హఠాన్మరణానికో దారితీసిన సందర్భాలు నేనెరుగుదును.

*   *   *

ఏమీ తోచకపోతే పోస్టాఫీసుకెళ్ళి కూర్చునేవాణ్ణి. బెనర్జీకి యేమంత చెప్పుకోదగ్గ పనిలేదు ఆఫీసులో. క్రొత్తలో నన్నూ నా సైనిక దుస్తుల్నీ చూచి బెదురు మూపులతో దూరదూరంగా వుంటూన్నా, అనతి కాలంలో నే ఆయన కూతుళ్లు మాయా, షీలా చనువైపోయారు. వాళ్ళతో తరుచు ఆడుకోడానికొచ్చే ఫాక్టరీ ఇంజనీర్ మహేంద్రనాథ్ కుమార్తె బిమ్లా కూడా స్నేహితురాలయింది. వెళ్ళినపుడల్లా యే రసగుల్లాలో, ఫలాలో, తేనీరు సహితంగా యెదురుగా వుంచే వాళ్ళు- ద్వేషమూ, కృత్రిమమూ యెరుగని ఆ పిల్లలు.

పదేళ్ళ వయసులోపువాళ్ళే యీపిల్లలంతా. సాయంత్రం నాలుగయేసరికి వీళ్ళందరూ క్యాంపులో హాజరయ్యేవాళ్లు. వాళ్ళొచ్చిన ఓ గంటువరకూ నాకు వూపిరాడని పని. ముందు వాళ్ళకి పళ్లూ, బిస్కట్లూ, తేనీరూ యివ్వడం. తరువాత యెవరికి తెల్లకాగితాల పుస్తకాలు కావాలో, పెన్సిలెవ్వరికో, పాళీ యెవరికో కనుక్కొని సర్దుబాటు చెయ్యడంలో కాలం దొర్లిపోయేది. ప్రవాసంలోవున్న నేనూ ఈ వంగదేశపు చిన్ని బాలికలూ వొకరితో నొకరం మిత్రత్వం ఏర్పరచుకున్నాం.

జనంతో నిండిన కాఫీహోటేళ్ళనీ, పార్కుల్నీ వొయ్యారంగా కాలేజీలకిపోయే అమ్మాయిలతో నిండిన రోడ్లనీ చూడాలని నిత్యమూవుండే జిజ్ఞాస యిపుడులేదు. అవన్నీ స్మృతిపథంలోంచి తప్పుకొన్నై.

వీటితో సన్నిహితమే నన్ను వేలకొలదిమైళ్ళ దూరంలోవున్న స్వీట్ హోంనీ, లవింగ్ వైఫ్‌నీ, డియర్ ఫ్రెండ్సునీ మరపింపజేసి జీవితానికో రసానుభూతి ప్రసాదించింది. అంతతో నేను జీవితంలో యేకాకిని కాననీ, చుట్టూ నన్ను అభిమానించే, గౌరవించే, ప్రేమించే ప్రజా, స్నేహితులూ, బంధువులూ వున్నారనీ ఫీలయ్యేసరికి నేను సైనికవ్యవస్థలో, మృత్యువుకి దగ్గిరగా, అధ్వాన్నపు అడవిలో జీవిస్తున్నానన్న తలంపే వుండేదికాదు.

కాని ఎస్టేట్ కార్మికుల జీవితాన్ని తరచి చూచినప్పటినుంచీ యీ సంతోషం అట్టే రోజులుండలేకపోయింది. ఈ జీవితంమీద విసుగూ విరక్తీ, రోతా, ద్వేషం అన్నీ ఒక్కసారిగా ఉబికినై.

* * *

ఎటుచూచినా, ఎటునుండి చూచినా, కనుచూపు మేరవరకూ విస్తరించిన తేయాకుతోటలే దర్శనమిస్తున్నయ్. ఏపుగా, పచ్చగా యెదిగిన దుబ్బులు కనులపండువగా ఉన్నాయ్.

వేలాది కార్మికులు పగలల్లా వంచిన నడుము లెత్తకుండా, కండ్లు తెరవని పసికూనలను వీపున కట్టుకొన్న పచ్చిబాలింతలూ, నడవడానికి శక్తి లేని వృద్ధులూ, శరీరపోషణలేని బాలబాలికలూ అవయవపటుత్వమే లేని బాలబాలికలూ, యంత్రాలకిమల్లె రెండాకులూ వొక మొగ్గా త్రుంచి బుట్టలు నింపడం చూశాను. అసలు వీళ్ళశరీరాల్లో రక్తమున్నదా అని నా సంశయం. ఉండెక్కడిది! తోటల్లోని జెలగలు యీ కార్మికుల రక్తాన్ని సగం త్రాగుతూంటే, మిగిలినదాన్ని యజమానులే త్రాగేస్తున్నారు. ఇక మిగిలినది రక్తమాంసాలు లేని జీవంతోవున్న కట్టెలు. ఇవి జీవచ్ఛవాలు.

ఈ తేయాకుతోటల్లోని కార్మికులేగాకుండా వాళ్ళసంతానమూ యజమానులసొత్తే. వాళ్ళ రక్తమాంసాలేగాకుండా, శరీరమూ, మానమూ, గౌరవమూ అన్నీ యజమానుల అధీనమే. వీళ్ళకి అక్షరాస్యత లేదు. ట్రేడ్‌యూనియన్లు లేవు. పెద్ద ఆశలు లేవు. ఆశయాలు లేవు. ఆదర్శాలు లేవు. పగలంతా చాకిరీ. మర్నాటిచాకిరీకి రాత్రితినే చాలీచాలని తిండి. మానాన్ని దాచీదాచని వోగుడ్డ. ఇవి వీరి అత్యవసరమైన ఆశలు. ఒకసారి ఈ యజమానుల గుప్పెటలో యిమిడిపోయిన తరువాత మరెన్నటికీ మోక్షంలేదు—మృత్యుదేవత దాస్యశృంఖలాల్ని విడగొట్టి స్వేచ్ఛావాయువుల్ని ప్రసాదించేదాకా.

ఇరవయ్యో శతాబ్దపు నాగరికతా ప్రపంచంలో యింకా కేవలం పెట్టుబడిదారుల కిరాతప్రభుత్వమూ, వ్యాధీ, దారిద్ర్యమూ, నిరక్షరాస్యతా నృత్యం చేస్తూన్న అమాయిక కార్మికుల అసహాయ పరిస్థితి నా శరీరాన్ని కంపింపజేసి నేత్రాల్ని వర్షింపచేసినై.

* * *

నడియా నడివయసులోవుంది. ఏ అపురూప సౌందర్యమో, ఏనాటి జవసత్వమో చావకుండా మిగిలిపోయింది యీమెలో. గుండ్రని ముఖమూ చారడేసికళ్లూ, వుబ్బెత్తుగావున్న రొమ్మూ, యిట్టే ఆకర్షిస్తాయి యెవరినైనా. మా శిబిరం ప్రక్కనుంచే ఆమె అనుదినమూ పనిలోనికెళ్ళేది. నేను పెరేడ్‌కెళ్లేసమయమూ, ఆమె పనిలోనికెళ్ళేవేళా వొక్కటే.

అగ్నిపర్వతం లోపల కుతకుతమంటూన్నా పైకి ప్రశాంతంగావుండే నేర్పు యెంతమందికున్నది? దీనావస్థలోవున్నా, ఆమె ప్రదర్శించే ధీరత్వమూ, కష్టాల్ని యెదుర్కొనగల సహనమూ అసహాయంగా జీవితధర్మాన్ని దొర్లించే చాతుర్యమూ, నన్ను చకితునిగ జేసినై. నాగరికతా, విజ్ఞానమూ యెరుగని యీ అడవిపూవు నాకే దివ్య సందేశాన్నో యిస్తున్నట్లు తోచింది. కష్టంలో, విచారంలో, దీనావస్థలో యెంతమందికి నవ్వడం చేతనౌతుంది ఆమెకిమల్లే! ఆ నవ్వు నా హృదయంలో హత్తుకొనిపోయింది. ఆమె కట్టుచీర మానాన్ని దాచే వ్యర్థ ప్రయత్నంలో విఫలమైనది. ముఖం సిగ్గుచే యెరుపెక్కింది. లజ్జచే కుదించుకుపోయింది ఆమె. మరుక్షణంలో ఆమె శిరసు వంచుకొని నెమ్మదిగా అడుగు వేసుకొంటూ వెళ్ళిపోయింది వెనుదిరిగి చూడకుండా. ఏడ్చాను. ఐనా ఏడ్చి ఏం చెయ్యగలను! వైద్యుడు కూడా రోగితో యేడిస్తే యేం కాను! ఒకానొకపుడు "పచ్చి బంగారంబు పండెను రత్నగర్భ" అయిన యీ అసార నిర్భాగ్య సీమలో తిండీ, గుడ్డా, వాకిలీ లేని కోటానుకోట్ల

దరిద్రులలో యీమె యొకతె.

* * *

నడియా భర్త రెండు సంవత్సరాల క్రితం తేయాకు తుంచుతూండగా వేసిన త్రాచుపాము కాటుకి, ఆహుతయాడు - మూడు సంవత్సరాలైనా నిండని పసిపాప సంరక్షణా బాధ్యత పూర్తిగా ఆమెకే వప్పగించి. లోన ప్రజ్వరిల్లే దుఃఖాన్ని, ఆమె బాష్పధారల్ని యిగిర్చేసింది. గుండె రాయిచేసుకొని బ్రతకడంకోసమే ఆమె బ్రతుకుతూంది.

పనిలోని కెడుతూన్న ఆమె వోనాడు శిబిరాని కెదురుగా ఆగి కేల్మోడ్చింది ఎప్పటిలాగే. ఆ కార్మిక సోదరికీ నాకూ మధ్య ఆత్మీయత వెల్లివిరిసింది. రెండు బిస్కట్లూ, ఒక కప్పుపాలూ అందించాను ఆమె పాపకి. కృతజ్ఞతతో స్వీకరించింది కల్లకపట మెరుగని ఆమె. త్వరలోనే ఇంఫాల్ నగరానికి పోతున్నామని యథాలాపంగా ఆమెకు చెప్పాను. ఆమె కనుకొలకుల్లోంచి రెండు అశ్రుబిందువులు రాలినై.

నేను విభ్రాంతుడనయాను. జీవితంలో ఇంతవరకు చూచి యెరుగని కార్మికసోదరి ప్రదర్శించిన అవ్యాజ వాత్సల్యానికి నా గుండె ఝల్లుమంది. హృదయంలో యేదో కెలికినట్లయింది.

"నడియా! జీవితయాత్రలో మనమంతా బాటసారులం. మళ్ళీ నాలాంటి బాటసారే నీకు మరోనాడు యిక్కడ తటస్థపడొచ్చు. నీలాంటి కార్మిక సోదరే మళ్ళీ నాకు మరోచోట కాన్పించవచ్చు. దుఃఖించి ప్రయోజనం లేదు" అని ఆమెతో అనగలిగాను.

"ఔను బాబూ! మీరన్నది నిజమే. కాని మానవహృదయాలు మనవి. వీటిని ఎంత వైరాగ్యంలోకి తిప్పుకొన్నా, మళ్ళించినా, ఆత్మీయతా, స్నేహమూ, అభిమానమూ స్ఫురణకి రాకమానవు. ఈ పాడు ప్రపంచంలో స్నేహాన్ని వాంఛించినా లంచం ముట్టజెప్పాలి. తన మానాన్ని తను కాపాడ దల్చుకొని, గౌరవంగా యింకొకరి స్నేహం వాంఛించడమంత దౌర్భాగ్యం మరొకటి కన్పించదు. మీరు వెళ్ళినా యీ నిర్భాగ్యురాలు మిమ్మలను స్మరించకుండా వుండలేదు. మీ సౌజన్య హృదయంలో యీ దీనురాలికి కొంచెం చోటు వుంచండి. అంతే నేను కోరేది" చిరునవ్వుతో వడివడిగా సాగిపోయింది.

* * *

సూర్యుడు తన సహస్రకిరణాలతో సందర్శన మిస్తున్నాడు ఆ సుప్రభాతాన్ని. మరొకవంక ఆకసంలో నీలిమేఘాలు సయ్యాటలాడుతున్నయ్.

పెరేడ్ పూర్తయింది. శిబిరం దాపునే నిల్చొన్నాను ఆమెకోసం ఎదురుతెన్నులు చూస్తూ. హృదయంలో దిగులుగావుంది. మానసికంగా యేదో ఆవేదన. పిచ్చెక్కినట్లు శిబిరంచుట్టూ కలయ తిరిగాను. ఆకస్మికంగా విజృంభించిన యీ కలతకి, చెలరేగిన తుఫానుకి కారణం స్ఫురించదు.

ఇంతలో నల్గురు ఒక శవాన్ని మోసుకుంటూ పోతున్నారు అనతిదూరంలో. ఆ భౌతిక శరీరపు అంతిమయాత్రలో ఆ యిదారుగురు నెమ్మదిగా అడుగులేసుకొంటూ నడుస్తున్నారు దీన దుఃఖవదనాలతో.

ఒకరిని ప్రశ్నించా "మరణించిన దెవరు?" అని.

"ఆమె నడియా బాబూ!"

చేతిలోని బిస్కట్లు జారిపడినయ్.

"ఇంతలోనే మృత్యువెట్లా వొచ్చింది ఆమెకి? నిన్నటి దినం కులాసాగానే కాన్పించిందే!"

"ఎందుకెళ్ళిందో యేమో తెలీదు బాబూ! తెల్లారి బంగాళాకెదురుగా వున్న పూదోటలో చచ్చి పడివుంది!"

ఒక్క వేడి నిట్టూర్పు విడిచాను.

"ఇవి మీకు క్రొత్తగాని మాకు పరిపాటే బాబూ! ఇదివరకెంతమందో. ఇపుడు దీనివంతు" అంటూ ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు.

* * *

పోలీసులులేరు. పోస్టుమార్టం లేదు. ఏడ్చేవారు లేరు. అధమం సానుభూతి చూపేవాళ్ళైనా లేరు. మూడేళ్ళ పసికూనని-భావి కార్మికురాలిని—టీ ఎస్టేట్ యజమానుల కొప్పజెప్పి యిహలోకయాత్ర చాలించింది వొక సోదరి-ఆకస్మికంగా, అసాధారణ పరిస్థితుల్లో.

ఎదురుగా పొగ! నల్దిశలా ఆవరించిన పొగ! ఆకాశాన పరుగులెత్తే మేఘాల నందుకోజూచే పొగ! అంతా పొగ!

★